అని గాభరాగా వుంది. మావారికేమో నవ్వు, అవసరంగా మేం గాభరాపడి తనని గాభరా పెట్టేసున్నామని చీవాట్లు పెడుతున్నారు.

నేనూ, మా అమ్మాయి కలిసి మా కున్న వన్నీ దబదబా పప్పుల డబ్బాల్లో, బియ్యపు డబ్బాలో దాచేశాం. కారం రెండు పొట్లాలు కట్టుకుని చెరొకటి చెంగుచాటున వాడికి కనబడకుండా చేతుల్లో దాచుకుని జాగ్రత్తపడ్డాం. మావారికి ఏమేం చెయ్యాలో చెప్పిపెట్టాం. నాలుగు లావాటి కర్రలు వాడికి కనబడకుండా కర్టెన్ల వెనక దాచాం.

మా హడావిడంతా చూసి మావారికి, వాడు నిజంగా దొంగేమోనని అనుమానంగా వున్నట్టుంది. కాని పైకిమాత్రం కనపడకుండా "అయితే మీరిద్దరూ కలిసి వాడి కంట్లో కారం కొట్టి, కర్రలతో తలకాయ పగలకొడ్తారన్న మాట" అనటం, నవ్వటం.

మామూలప్పుడయితే, మేమూ ఎగతాళి పట్టించేవాళ్ళమేగాని, మా గాభరాలో నవ్వులు గివ్వులూ మా చెవికెక్కడంలేదు. ఎందుకంటే ఇంట్లోకి ఎలకొస్తే, వెళ్ళగొట్టటానికి మావారు చేసే 'కథాకళి' ఫిలిం తీయాల్సిందేగాని, వర్ణించటానికి మాటలు చాలవు.

ఇంతలో తలుపుమీద 'టకటక'మని చప్పుడయింది. భయంవల్లో యేమో ముగ్గురం వొక్కసారే 'కోన్‌హై' అని కోరస్‌లాగా అరిచాం. 'మైహూ కర్తార్‌సింగ్' అన్నాడు.

తలుపు తియ్యగానే, పళ్ళికిలిస్తూ లోపలి కొచ్చి కుట్టడం మొదలెట్టాడు. నేనూ, మా అమ్మాయి వాడికి వెనగ్గా ఒకళ్ళు, ముందు వైపు ఒకళ్ళు కొద్దిగా దూరంగా కూచున్నాం. నాకు పిస్టల్ చూపిస్తే కంట్లో కారం తన్ను కొట్టేట్టు, తనకు చూపిస్తే నేను కొట్టేట్టూ పెద్దగానే మాట్లాడుకుంటున్నాం.

ఆఖరి కవరు కుడుతున్నాడు. మధ్య మధ్యలో మా యిద్దరివంకా చూస్తున్నాడు గమ్మత్తుగా. కుట్టటం అయిపోయినట్లుంది, అన్నీ సర్దుకుంటున్నాడు కత్తెరా, టేపు, దారాలు అన్నీ సంచీలో వేసుకుంటున్నాడు. మా అమ్మాయి "అమ్మా జాగ్రత్త. ఇప్పుడే తీస్తాడు పిస్టల్ సంచీలోంచి. రెడీగా వుండు" అంటోంది.

నాకు చెమటెక్కువయి కాళ్లు, చేతులు వణకటం ప్రారంభించాయి. ఆ వణుకుడికి కారం పొట్లం వొదులయి చిన్నగా రాలటం మొదలయింది. కారం కోరుకి వాడు, మావారు పోటీలు పడ్డట్టుగా తుమ్మటం మొదలెట్టారు.

ముక్కు తుడుచుకుంటూ "అచ్చా సాబ్ పైసా దేదీజియే" అన్నాడు. అన్నదే తడవుగా డబ్బు వాడిచేతిలో పెట్టి దబదబా వీధితలుపు తెరిచారు మావారు "వెళ్ళరా వెధవాయీ" అంటూ.

వాడు వెళ్ళటానికి రెండు మెట్లు దిగి, మా వైపుతిరిగి "దర్జీవోల్లంతా దొంగోల్లుగారండీ" అని తెలుగులో అంటూ గబగబా మెట్లు దిగి వెళ్ళిపోయాడు.

"ఓరి వెధవయ్యా! నువ్వు కొన్నాళ్ళు సికింద్రాబాద్‌లో వున్నావన్న సంగతి మర్చిపొయ్యాంరా బాబూ" అనుకున్నాం. ✳






